# 21. ఆదర్శ జీవి

శాస్త్రి జీవితంలో మొట్ట మొదటిసారి మనసు చలించి, చెప్పిన మాట వినకుండా మొండికేసింది మల్లికను చూసినప్పుడే! ముప్పై ఏళ్ళ జీవితంలో సుందరాంగులెవ్వరూ అతనికి ఎదురవలేదనుకోనక్కరలేదు. నిజానికి ఎంతో మందిని చూడటం, చూసిన తక్షణం మనసును మార్చుకోగలగటం చాలాకాలంగా శాస్త్రికి అలవాటైంది. ఇందుకు కారణం ఏమంటే, తను డార్విన్‌థియరీని ఇట్టే రుజూ చేయగలిగేట్లు ఉండడమేగాక, ఆ సంగతి స్పష్టంగా తనకు తెలియటం; కనుక రొమాన్స్‌లో కాస్త ముందుకు సాగుతే కలిగే ఫలితాలు తను తేలిగ్గా వూహించుకోగలడు. ఇంత శ్రమపడి చివరకు శృంగభంగమే అవుతుందని తెలిశాక, దాని జోలికి పోయేటంత మూర్ఖుడు కాదు తాను.

ఐతే మల్లిక విషయం వేరు; పేరు ఎంతబాగుందో, మనిషికూడా అంతబాగానూ వుంటుంది. సన్నగా, నాజూగ్గా, పొడుగ్గా, మెరిసే కళ్ళతో ఆమె వయ్యారంగా నడుస్తూంటే శాస్త్రి లోలోపల లొట్టలు వేసేవాడు. మరీ ఆమె కంఠస్వరం - కళ్లు మూసుకొని వింటే మాత్రమేం - ఆ వ్యక్తి అందాన్ని కంఠస్వరాన్ని బట్టే తేలిగ్గా అంచనా వేయవొచ్చు. ఆమె శరీరంలోని ప్రతి చిన్న భాగమూ స్త్రీత్వాన్ని రూపిస్తూనే వుంది. ఇదివరకు తను చూసిన స్త్రీలకూ యీామెకూ ఏమీ సంబంధమే లేదనిపించింది. యీామెను చూసి మతిపోయినట్లు ప్రవర్తించకుండా ఉండటం అంత తేలిక కాదని తెలుసుకోగలిగాడు.

అంతమాత్రానికే శాస్త్రి తలక్కిందు లయ్యేవాడుకాదు. రూపం లేకపోయినా, తెలివి తేటలకు తక్కువలేదు. కనుకనే మెల్లిగా రేడియో స్టేషన్‌లో ఉద్యోగం సంపాయించ గలిగాడు. అలాటి తన మనస్సు చలించేందుకు మరికొన్ని కారణాలు, ఇతరులకు ఎలా వున్నా, తనను నడిపించ గలిగినవి ఉన్నవి.

మల్లిక నవనాగరికతను ఆరాధించే యువతి కనుక స్టేషన్‌లో అందరితోనూ, ఆడా మొగా అనే భేదం లేకుండా స్వేచ్ఛగా మాట్లాడుతుంది. కాస్త వేళాకోళం చేసినా నొచ్చుకోదు సరిగదా తనూ ఆనందిస్తుంది. యవ్వనశోభకు చిరునవ్వుకూడా తోడై కనిపిస్తూంటే ఏ పురుషుడికి మనస్సు చలించకుండా వుండదు కనుక? అందులోనూ ఆమె చదువుకున్నదీ, విజ్ఞానికూడాను. భర్త ఆమెను వొదిలేశాడో, లేక ఆమే భర్తను వొదిలేసిందో ఎవ్వరికీ సరిగ్గా తెలియదు. ఏమైనా ఆమెకు ప్రస్తుతం మొగదిక్కు లేదనే నిజంమాత్రం అందరికీ తెలుసు. అందువల్ల ఆమెను కోరేహక్కు ప్రతి యువకునికీ వుంది.

ఇంతవరకూ చెప్పుకున్న కారణాలు పురుష ప్రపంచాని కంతకూ సరిపడేవి. ఇవిగాక తనకు ప్రత్యేకింపబడిన మరికొన్ని కారణాలున్నవి.

ఆమె తనను "గురువుగారూ!" అని పిలుస్తుంది. తనంటే ఎంతో గౌరవం. నిజానికి తను రాసే ప్రతి నాటికలోనూ మల్లికనే వూహించుకొని ఒక పాత్ర ప్రవేశపెడుతూనే వున్నాడు. యీ సంగతి ఆమెకు కూడా తెలుసనేందుకు, నాటిక చదవగానే ఆమె, తను వూహించిన పాత్ర ఎంతో బాగున్నట్లు చెబుతుంది. యీ విధంగా తమ అభిరుచులు బాగా కలిసిపోయినవి.

మరీ మల్లికను దృష్టిలో వుంచుకొని చేసిన పాత్రీకరణలో ఆదర్శం తాలూకు డోసు బాగా గుప్పిస్తుండటం రెండు ఉద్దేశాలతో చేస్తూన్న పని. ఆదర్శవంతగాలేని పాత్రల్తో సాహిత్యం ఉండరాదని తన నమ్మకం. నీతికేమి, త్యాగబుద్ధికేమి, హృదయ నైర్మల్యాని కేమి - ప్రపంచంలో ఉండగల మంచి లక్షణాల్లో కొన్నిటిని ఎత్తి ఆ పాత్రీకరణకు అంటకడుతూంటాడు. అలా ఐతేనే కాని సర్వజనామోదరణ పొందదనీ, అసలు అలాటివి రాసేందుకే తాను నియమించ బడ్డా డనీ తనకు తెలుసు. యీ విధంగా స్వామిసేవ జరుగుతోంది. పోతే రెండో ఉపయోగం ఇది: ఆ పాత్రను సృష్టించాడంటే మల్లికకు తప్పకుండా ఛాన్సు వుంటుంది. అలాటిది తనే బాహాటంగా సూచిస్తుంటాడు కూడాను. ఆమె పాత్రను అర్థంచేసుకోగల సమర్థురాలు కనుక - బాహ్య సౌందర్యాన్ని తృణీకరించటం హృదయ సౌందర్యం, ఆత్మ సౌందర్యాల్ని మాత్రమే గ్రహించగలగటం జరుగుతుంది. అంటే తన భావాలనూ, తన ఆదర్శాలనూ యీవిధంగా "ఇన్ డైరెక్ట్‌గా" ఆమెకు ప్రచారం చేసుకునే ప్రయత్నమే నన్నమాట; ఆమె మనసుకు యీ భావాలు ఘాటుగా నాటుకున్న వనే నమ్మకం కలిగిన నాడు,

బాహ్య సౌందర్యంతో తాను గెలుచుకోలేని మల్లికను, హృదయ సౌందర్యంతో తప్పక గెలుచుకోగలడు. ఇంత తెలివిగా ఆలోచించగలడు కనుకనే అభ్యుదయ భావాలుగల తన కవిత్వానికి ఒకప్పుడు దేశంలో కొంత ప్రచారం జరిగింది.

మల్లిక కూడా ఆధ్యాత్మిక విలువల్ని గ్రహించగల విజ్ఞురాలని తనకు తెలుసు. అందుకనే ఆమె తనను అంత గౌరవిస్తుంది. మరోవిధంగా చూస్తే ఇప్పుడు నెలకు నాలుగైదు సార్లన్నా మల్లిక రేడియో స్టేషన్‌కు వొచ్చే అవకాశాన్ని తాను కల్పించ సాగాడు. ఇందువల్ల ఆమె ఆర్థిక సమస్య కొంతవరకూ తీరగలదు. కనీసం తనపట్ల కృతజ్ఞతను చూపవలసిన బాధ్యత ఆమెకు వుంది.

మిగతా ఆర్టిష్టులతో తనకు పనిలేదు. ఆ మాటకొస్తే చాలామంది ఆడ ఆర్టిష్టులు తన వెంటబడ్డారు – తమకు తగిన పాత్రల్ని సృష్టించి నాటకాలు రాయమని. కాని తను లొంగాడా! ఎవరికీ కష్టంలేకుండా “చూస్తాను” అని తప్పుకుంటూనే ఉన్నాడు. మరీ రాధ – తననొక దైవంగానే కొలుస్తూవుంది. ఐనా తనామెకు ఎలాటి విలువనూ ఇవ్వలేదు. ఆమె అంటే తనకు అసహ్యం కూడాను.

కారణం ఏమిటోకూడా శాస్త్రి ఆలోచించకపోయినా, చెప్పవలసిన బాధ్యత మాకువుంది. మల్లిక ఉత్తర ధ్రువమైతే – రాధ అన్ని విషయాల్లోనూ దక్షిణధ్రువం! మరీ రాధను చూస్తే, తన భార్య జ్ఞాపకం వొస్తుంది. శాస్త్రికి ఏదో చిన్నతనంలోనే వివాహమైంది కనుకా, నైతిక విలువలకూ, బాధ్యతలకూ లొంగిపడివున్నాడు కనుకా ఆ భార్యను ఏలుకుంటున్నాడు. కాని, ఆధునిక శృంగార భావాలున్న యీనాటి యువకుడైతే, ఆమెను వొదిలేసేవాడు. ఆదర్శం కోసమే తనింకా వేళ్లాడుతున్నాడు. అసలీ ఆర్థిక బాధలన్నీ ఆమెవల్లా, ఆమె కనే సంతానం వల్లనే! ఒక పక్క ఆమెను ఏవగించుకుంటూనే, ఎలాగో కళ్ళు మూసుకొని యీ సంసారాన్ని యీదుకు వొస్తున్నాడు! భార్య తేలిగ్గా వొదిలేదికాదు కనుక శాస్త్రి ఆదర్శం తిరుగులేకుండా పనిచేసింది. ఒక పక్క ఆ అవస్థపడుతూ, తన భార్యను ముమ్మూర్తులా జ్ఞాపకానికి తెచ్చే యీ రాధను అంటించుకోవటంలో అర్థంలేదని తెలిసే, ఆమెను దూరంగా వుంచాడు.

సౌందర్యమూర్తి ఐన మల్లికను తాను ఆరాధించటం ఉత్తమ కళాకారుని గుణాన్ని చాటుతుంది. సౌందర్యోపాసనకు ఇంతకన్న మంచి అవకాశం మరి దొరకదు. ఐతే యీ సౌందర్యం దేహానికి సంబంధించిందే నని మనం ఎవ్వరమన్నా అంటే శాస్త్రి మండి పడతాడు. ఎందుకంటే తన అభ్యుదయ వాదమంతా ఆ హృదయ సౌందర్యంమీదా, ఆత్మసౌందర్యం మీదనే నిలబడివుంది. కావాలంటే అతని రచనలు చూస్తే బాగా అర్థమౌతుంది.

“ఇవాళ ఉండి, రేపటికి నశించిపోయినా నలిగి పొయ్యేది తుచ్ఛమైన దేహసౌందర్యం! ఆ హృదయ సౌందర్యం వుంటే – అదే శాశ్వతం. సామాన్యులు

దాన్ని కనిపెట్టలేరు కాని, ఒకసారి ఆ సౌందర్యాన్ని చూడగలుగుతే అప్పుడే అర్థమౌతుంది ఆ విలువ!" యీ ధోరణిలో వుంటుంది వాదన. మనం సామాన్యులం కనుక, శాస్త్రి హృదయ సౌందర్యారాధనను అర్థం చేసుకోలేక పోవొచ్చు!

స్టేషన్‌కువొచ్చే ఆడజనాభా అంతలోనూ మల్లిక అంటేనే తనకు ప్రత్యేక గౌరవమనే సంగతి ఆమెకూడా గ్రహించేట్లు ప్రవర్తిస్తాడు. స్టేషన్‌లోవున్న మొగజనాభా అంతలోనూ తనంటేనే మల్లికకు ప్రత్యేక గౌరవమనే సంగతి తాను గ్రహించేట్లుగా ఆమెకూడా ప్రవర్తిస్తుంది. హృదయాల్ని అర్థం చేసుకున్నామనేందుకు ఇంతకన్న రుజూ ఏం కావాలి?

శాస్త్రి వేషభాషల్ని చూసిన వాళ్లెవరూ, అతని మనసులో వున్న విషయాల్ని ఏ విధంగానూ గ్రహించలేరు. యీ మనసుల్లో జరిగే పోరాటాలూ, ఆరాటాలూ పైకి కనిపించేవి కావు. కనుకనే చాలామంది పెద్ద మనుషుల గౌరవ మర్యాదలు కాపాడబడుతూన్నవి. యీ మాత్రం రహస్యమంటూ ఉండబట్టే లోకం సాగుతోంది కాని, లేనట్లయితే ప్రళయమే ఏనాడో వొచ్చివుండేది. ఉదయమే స్నానంచేసి, సంధ్యవార్చి మొహాన విభూతి తగిలించి, మధ్యలో అర్ధరూపాయి వెడల్పున కుంకుమ బొట్టు పెట్టి, అద్దంలో చూసుకోగానే తన కన్న పెద్దమనిషి, ఆదర్శజీవి ఎలా వుండగలడో శాస్త్రికే అనుమానం వొస్తుంది. అలాని తనను మల్లి కేమిటి - అందరూ గౌరవించాల్సిందే! మరీ ఇండియా మ్యాపులాటి ఆ ముఖారవిందంలో మధ్య భారతదేశంలో సోడాబుడ్డి అడుగుభాగమంత దళసరి కళ్ళ అద్దాలజోడు తగిలిస్తే, తన మొహం తనకే భయంకరంగా వుంటుంది. అలాటి భీకరాకారానికి దరిదాపుల్లోకి వొచ్చేందుకు ఏ నీచ వూహకూ గుండె వుండగలదని ఎవరనుకుంటారు? ఇక పూర్వీకుల కాశ్మీర శాలువనుకూడా కప్పుకుంటే వేషధారణ పూర్తయి, తనొక కవిగానే కాకుండా, గొప్ప వేదాంతిగాకూడా చలామణీ అవగలడు. ప్రాపంచిక విషయాలకు తాను అతీతుడనేట్లుగా వేసే పోజులో తను ఇన్నాళ్లూ దిగ్విజయ యాత్రను సాగిస్తూనే వున్నాడాయె!

ఇప్పుడు జీవిత గమనం కాస్తమారి తీరవలసిన అవసరం ఏర్పడింది. ఎలాగైనా మల్లికను లొంగదీసుకోందే తన బతుకే వ్యర్థమవగలదనే నమ్మకం ఏర్పడిపోయింది. అందులోనూ వాతావరణమంతా తనకు ఎంతో అనుకూలంగా వున్నట్లు తోచటం వల్ల, తగిన సమయంకోసం మాత్రమే వేచి వున్నాడు. ఆదర్శాన్ని బలిపెట్టందే సౌఖ్యం లభ్యమవదు. ఐతే తన ఆదర్శం భగ్నమైందనే సంగతి తనకూ, మల్లికకు మాత్రమే తెలుస్తుంది. తనెలాగూ పైకి చెప్పుకోడు. ఒకే నేరాన్ని చేసిన ఇద్దరు నేరస్థుల్లో ఎవ్వరూ తమ నేరాన్ని బైట పెట్టుకోరు కనుక, ఆమె కూడా ఎవరకీ చెప్పదు. కనుక తన ఆదర్శం ఎప్పటి వలెనే గట్టి పునాదుల్తో నిలబడి వున్నదని తను లోకాన్ని తేలిగ్గా నమ్మించగలడు. లోకమంతా నమ్మేదాన్ని తను నమ్మలేకపోడు! అప్పుడు తనకు ఆదర్శంతోపాటు అనుభవం కూడా లభ్యమౌతుంది.

సమయంకోసం వేచివున్న తరుణంలో ఒకనాడు మల్లిక "గురువు గారూ!" అంది.

గురువుగారు తుళ్ళిపడ్డారు. ఆ కంఠస్వరంలో ఏదో వేడికోలు - కాదు అనురాగసుధ పొంగి పొర్లుతోంది.

"మీ యింటికి వొకసారి రావాలండీ!" అందామె.

ఎందుకు అని అడిగే ధైర్యం లేకపోయింది శాస్త్రికి. ఇల్లు అనుకూలమని ఆమె అనుకుంటోంది కాబోలు! తన ఇల్లు కనుక చూస్తే దేశంలోని రాజకీయ, ఆర్థిక సంచలనమంతా తేలిగ్గా అర్థమవగలదు. తన భార్యను చూసినా, ఆమె నిరంకుశపాలన చూసినా తనపట్ల మల్లికకు వుండే గౌరవం క్షణంలో దిగజారుతుంది. కనుక ఎలాగైనా ఆమెను యింటికి రానీకూడదు.

"ఒకనాడు నేనే తీసుకొని వెళ్తాను," అన్నాడు, ఎలాగో ప్రస్తుతానికి తప్పించుకుందామని. అంతతో ఆమె వూరుకుంది. తను కల్పించిన అవకాశాన్ని తోసిపుచ్చినందుకు మల్లికకు కోపం వొస్తుందనుకున్నాడు తను. అలాటిదేమీ కనబరచకుండటం తన అదృష్టమే ననుకున్నాడు. పోతే తను ఒక కొత్త అవకాశాన్ని సృష్టిస్తేనే కాని, ఉభయులకూ తరుణోపాయం ఉండదు... ఇది హృదయాల్ని అర్థంచేసుకోగల శాస్త్రి మనసులో మెదిలిన నిశ్చయం!

రోజురోజుకూ ఆమె తనకు సన్నిహిత మౌతోంది. ఎంత ప్రయత్నించినా తనకు తగిన అవకాశం, తన హృదయవేదనను ఆమె ముందు వెళ్ళబోసుకునే సావకాశం కలగటంలేదు. ఏపని చేస్తున్నా యీ "అవకాశాన్ని" గూర్చిన తలపులే అతన్ని వేధిస్తూన్నవి. రచనల్లో అవకాశం అనేమాట ఎక్కువసార్లు దొర్లుతూంది...ఆమెతో తను చెప్పుకోవాల్సిన మాటలు కూడా రచనల్లోకి వొస్తవి. దీన్ని ఆమె అర్థం చేసుకోగలుగుతుంది - కనుక, ఒక పక్క తన పని తేలికవుతుంది. ఏమైనా ఆ సదవకాశం ఎప్పుడు రాగలదా అని జపం చేయటమే తనకు మిగిలింది.

ఒకనాడు ఎవరో ఇద్దరు మల్లికను గూర్చి మాట్లాడుకోవటంవిన్నాడు. తనకూ ఆమెకూ వున్న హృదయ బంధం సంగతి వాళ్ళకు తెలియదు. వాళ్ళ సంభాషణంతా ఆమె డబ్బుకు లభ్యమౌతుందని!

తనకు వొళ్ళు మండింది. తగిన బలమే వుంటే ఇద్దర్నీ చితకబొడిచే వాడు...అర్థంలేని ఉద్రేకాన్ని తగ్గించుకొని తను విన్న మాటల్ని గూర్చి ఆలోచించాడు. ఆమె డబ్బుకు లభ్యమౌతుందనేది నిజమే కావొచ్చు. కానట్లయితే ఆ పెద్దమనుషులకు ఆమె మీద పగా? వాళ్ళకు దుష్ప్రచారం చేయాలని కుతూహలమా?

నిజానికి మల్లిక మీద తనకు అసహ్యం కలగాల్సింది. కాని అలా కలగలేదు. పైపెచ్చు ఆమె మీద జాలి కూడా కలిగింది. ఇల్లు గడవక, అవసరం కోసమై ఆమె తిరిగి ఉండొచ్చు. అదంతా ఆమె తప్పేనా? యీ రకం పెద్దమనుషులకు బాధ్యతలేదా? నిజానికి వీళ్ళను సమాజం శిక్షించ గలిగితే, మల్లికలాటి అమాయక స్త్రీల శీలం దానంతటదే కాపాడుబడుతుంది. వెధవ డబ్బుతో వాళ్ళామె శరీరాన్ని కొనుక్కొని వుండొచ్చు. కాని ఆమె హృదయం - పవిత్రమైన ఆమె ఆత్మకు ఆ నైచ్యం ఏ విధంగానూ సోకదు. వాటికి పైశరీరమే ఒక రక్ష. ఆ పవిత్రహృదయం - తనలాటి వాడికోసం ప్రత్యేకించబడే వుంది. కనుక తన ఆదర్శం మారవలసిన పనిలేదు.

తను విన్న సంభాషణకు ఏ విలువా ఇవ్వకూడదనే నిశ్చయం ప్రబలింది. అది నిజమైనప్పటికీ డబ్బు మిషతో ఆమెను లొంగదీసుకోవటం ఎంత నైచ్యమో తనకు తెలుసు. యీ పద్ధతి తనలాటి వాళ్ళకు పడదు కూడాను. ఎందుకంటే మల్లిక వలెనే తనుకూడా ఆర్థిక దుస్థితిలోనే వున్నాడాయె! ఆమెను పొందేందుకు తను చుట్టుతోవ పట్టినప్పటికీ, అది ఆదర్శంతో కూడి శాశ్వత సౌఖ్యాన్నిచ్చేది. హృదయంద్వారా మనిషిని స్వంతం చేసుకోలేని దద్దమ్మ కాదు తాను!

సమయం దొరికినప్పుడల్లా మల్లికకు సూచనగా తన ప్రణయాన్ని వెళ్ళబోసుకుంటూనే వున్నాడు. కాని తను అనుకున్నంతగా ఆమెలో చలనం కనిపించటం లేదు. యీ డొంక తిరుగుడు పద్ధతులు మరి లాభం లేదు. ఎదురుగా నిలబడి వేదనతో ఆమెకు తన హృదయక్షోభను వెల్లడించుకోవాలి. అందుకే తగిన సమయం కోసం తాను యిన్నాళ్ళూ వేచి కూర్చున్నాడు.

బైట విపరీతంగా వర్షం కురుస్తోంది. మర్నాటికి కావలసిన నాటిక దాదాపు పూర్తయింది. కాని ఇంటికి వెళ్ళటం ఎలాగా అనే ఆలోచన ఒక పక్క శాస్త్రిని వేధిస్తూనే వుంది. తనొక్కడూ తప్ప ఆఫీసులో మరెవ్వరూలేరు. రాత్రి తొమ్మిదయాక యీ గాడిద చాకిరీచేసే ఓపిక ఎవరికుంటుంది - తనలాటి అభాగ్యజీవికి తప్ప!

యీ సమయంలో మల్లిక ఒక్కార్తేవొస్తే ఎంత బాగుండును! యీ వూహ రాగానే శాస్త్రి కలం మరి కదలలేదు, ఆ సుందరదృశ్యం అతని కళ్ళ ముందు ఆడుతోంది. నిజంగా వొస్తే-? యీ తలపు వొచ్చినప్పుడు వొళ్ళు పులకరించింది. ఇంటికి వెళ్ళటం ఎలాగనే వూహ కానీ, ఆకలి వేస్తూన్న బాధకానీ అతనికిలేదు-

"గురువుగారూ!"

శాస్త్రి తుళ్ళిపడ్డాడు. నిజంగానే మల్లిక వొచ్చింది. ఆమె కంఠస్వరం వినేటప్పటికే, అతని శక్తులన్నీ మూగపోయినవి. జరగదనే నమ్మకం వున్నప్పటికీ, జరిగినట్లయితే ఎంత ఆనందంగా వుంటుందో తలుచుకొంటూన్నప్పుడు నిజంగానే జరిగినట్లయితే వ్యక్తి మూగపోవటం లాటిది శాస్త్రిపట్ల జరిగింది.

"గురువుగారూ! అలా వున్నారేం?" అందామె!

శాస్త్రి యీ హెచ్చరికతో తన శక్తుల్ని తిరిగి కూడదీసుకుంటూన్నాడు. ఆమెనుచూస్తూ అలాగే ఆశ్చర్యపొయ్యేడు. యీమె ఎంత బాగుందీ! తనకోసం ఇప్పుడే ఆకాశంలోనుంచి దిగిన దేవకన్యల్లే - ఎంత స్వచ్ఛంగా, వయ్యారంగా, నాజూగ్గా, ఆడతనమంతా ఒక్కచోట జేరినట్లుగా, కళ్ళను మిరుమిట్లుగొల్పి హృదయాన్ని పిండివేసి, మనిషికి పిచ్చెక్కించేట్లుందామె! యీమెలో ఇంత అందం, యవ్వనం, ఆకర్షణ ఉన్నవని ఇదివరకు తనెప్పుడూ అనుకోలేదు. అందుకని కాదా తను హృదయంతోనే ఆమెను ప్రేమించ గలిగింది?

"ఏమిటలా వున్నారు?" అందామె మళ్ళీ.

ఇప్పటికి శాస్త్రి పూర్తిగా మేల్కొన్నాడు. గదిలోనుంచి చుట్టూ వొకసారి చూశాడు. ఎక్కడా ఎవ్వరూలేరు. ఆమె ఆ జాగ్రత్తలు పడకుండా వొచ్చేటంత మూర్ఖురాలు కాదు.

"ఇప్పుడెక్కణ్ణుంచి వస్తున్నారు?" అన్నాడు శాస్త్రి తొందరపడకుండా.

"ఎనిమిదింటికే ప్రోగ్రాం ఐంది. అప్పటినుంచీ ఒకటే వర్షం. వెళ్ళేందుకు వీల్లేక ఉండిపొయ్యాను. మీ గదిలో లైటు వెలుగుతుంటే వొచ్చాను."

ఇంతకుముందు యీ వర్షాన్ని దూషించుకున్నాడు. కాని ఇదెంత సానుకూల వాతావరణాన్ని సృష్టించిందో అర్థం కాగానే వర్షాన్ని మెచ్చుకొన్నాడు.

"ఎవ్వరూ లేరా?"

"ఎవరుంటారు? కార్లు ఉన్నవాళ్ళందరూ వెళ్ళిపొయ్యారు. స్టూడియోలో చివరి ప్రోగ్రాం వాళ్లున్నారు. మనబోటివాళ్ళు మాత్రం..."

శాస్త్రి ధైర్యాన్నంతా కూడగట్టుకున్నాడు. మిణుకుమనే పిరికితనాన్ని దీర్ఘమైన నిట్టూర్పుతో బైటికి తోసేశాడు. ఆమె వయ్యారంగా తన కెదురు కుర్చీలో కూర్చొని, మోచేతులు టేబిల్‌మీద ఆనించి తన కళ్ళల్లోకి వింతగా వాంఛలను రెచ్చకొట్టే విధంగా చూస్తోంది. హ్రస్వదృష్టి కళ్ళజోడు తీసేసి ఆ కళ్ళలోంచి చూస్తే ఆమె హృదయం తనకు స్పష్టంగా కనిపిస్తూనే వుంది. ఆ హృదయంలో తనలాటి ఆదర్శజీవికే స్థానం వుంది. అందుకనే అది ఖాళీగావుండి, తన ఆక్రమణకు స్వాగతాన్నిస్తున్నట్లు వుంది.

నాటకాల్లో రాసిన రకరకాల ప్రణయ సంభాషణలు చప్పున గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. తను అనిపించ దల్చుకున్న మాటల్ని ఇతర్లచేత అనిపించటం తేలికేకాని, తన నోటివెంటనే అనటం చాలా కష్టమనిపించింది. కాని ఇలా ఆలోచిస్తూ దొరికిన యీ కాస్త అవకాశాన్నీ వొదులుకుంటే ఇక తన జీవితంలో మళ్ళీ ఇలాటిది రాదని తెలుసు.

"మల్లికా!" అన్నాడు, నూటారుడిగ్రీల జ్వరంలో, సంధివొచ్చి మాట్లాడేవాడిలాగు.

"ఆఁ" అందామె స్వప్నంలో వలే.

"ఒక్కమాట చెప్పనా?"

"చెప్పండి" అని ఆమె ఆతృతతో చూసింది - తను ఏం చెప్పబోతున్నాడో తనకు ముందే తెలుసునన్నట్టు.

చెప్పేది తను కాదన్నట్టుగా క్వినైన్ మిక్చర్ తాగే రోగల్లే కళ్ళు మూసుకొని "నేను...ప్రేమిస్తున్నాను..హృదయపూర్వకంగా" అన్నాడు గుటకలు వేస్తూ.

ఫలితాన్ని గమనించేందుకు మెల్లిగా కళ్ళు తెరిచాడు. ఆమె నవ్వుతోంది - అంగీకారంగానో, ఎగతాళిగానో తెలియలేదు. హృదయాన్ని అర్థంచేసుకోగల శాస్త్రికి మాత్రం అది అంగీకారంగానే తోచింది.

కోమలమైన ఆమె చేతిని తాకుతూ "నిజంగా మల్లికా! యీ హృదయవేదనలు ఎలా చెప్పేది? నీ దేహసౌందర్యానికి కాదు ... నీ ఆత్మ సౌందర్యానికి నేను దాసుణ్ణయ్యాను..." అన్నాడు.

ఆమె చేతికి ఎలట్రిక్ షాక్ తగిలినట్టు వెనక్కు లాక్కుంది.

"ముగ్గురు బిడ్డల తండ్రివి - ఏమిటిది?"

తనకు కలిగిన ముగ్గురు బిడ్డలకూ తానెన్నడూ గర్వించలేదు. అందుకు వాళ్ళనూ, తన సంసారాన్ని కూడా నిందించుకున్నాడు. యీనాడు మల్లికకు కూడా తన బిడ్డలు భారమనిపించటం, తమ హృదయాల ఏకత్వాన్ని సూచిస్తూనే వుంది.

"ఏం చేయను?...అదంతా పోనీ...నీ ఆత్మ సౌందర్యం -" బహుశా ఆమె తమ మధ్యవున్న వయోభేదాన్ని సూచిస్తున్నట్లుంది. యీ వయస్సు వెధవ శరీరానికే కాని ఆత్మకు కాదనే సంగతి ఆమెకు అర్థం కాలేదు కాబోలు!

ఆమె ముఖం చూస్తే చెపుదామనుకున్న మాటలుకూడా భయపడి బైటికి రావటంలేదు. ఆమె ముద్దుముఖం క్రమంగా ఎర్రబడుతోంది. ఎలక్ట్రిక్ లైన్ సిగ్నల్ ఆరింజ్ నుంచి ఎరుపుకు మారుతున్నట్లుది. యీ డేంజర్ సిగ్నల్ కళ్ల ఎదుట ప్రత్యక్షమౌతూంటే శాస్త్రికి క్రమంగా పైత్యం దిగనారంభించింది.

"హృదయంతో, ఆత్మతో ప్రేమించే వాడివి, చెయ్యెందుకు పట్టుకున్నావ్?" అందామె.

ఇంత మాత్రమన్నా ఆమెకు తెలియదంటే తనకు ఆశ్చర్యమే ఐంది. ఆమె అనుమానాన్ని సమాధానపరిస్తే తనకు ఛాన్సు వున్నదనే అనిపిస్తోంది.

"హృదయంలోని ప్రేమను వ్యక్తీకరించేందుకు, మానవమాత్రుణ్ణి కనుక -"

"శరీరంద్వారా ప్రకటిస్తావ్" అని కోపంగా అందామె." యీ వెధవ వేషాలు నాదగ్గిర పనికిరావు. ఏదో గౌరవంగా గురువుగారూ అంటూన్నందుకు ఇదా? నీవుచెప్పే

ఆదర్శాలూ, హృదయసౌందర్యం, ఆత్మసౌందర్యం, అభ్యుదయ దృక్పథం ఇవన్నీ రచనల్లోనేనా! నీ నిత్య జీవితంలో కాదన్నమాట?"

నిత్యజీవితంలో యీ హృదయాలూ, ఆత్మల తాకిడి కూడా భరించటం కష్టమని చెప్పటం ఎలా?

"స్టేషన్ డైరెక్టర్‌కు రిపోర్టు చేయనా?"

శాస్త్రి కాళ్ళకింద పెద్ద భూకంపం అవతరించినట్లయింది. ఆదర్శం పోతే, మరో ఆదర్శాన్ని పట్టుకొని వేళ్లాడొచ్చు కాని, యీ ఉద్యోగం పోతే, వీధుల్లో దొర్లాల్సిందే! హృదయ సౌందర్యం సంగతి దేవుడి కెరుక – ముందు దేహారోగ్యాన్ని కాపాడుకోవటం ఎలా?

"మల్లికా! యీ ఒక్క తప్పు క్షమించు..." ఇంకా ఆమె కాళ్ళ మీద పడదామా అనికూడా ఆలోచిస్తున్నాడు.

"వాళ్ళు దగ్గిరపెట్టుకొని వుండు–" అని ఆమె రుస రుసలాడుతూ వెళ్ళిపోయింది.

అంతతో వొదిలినందుకు శాస్త్రి తను అదృష్టవంతుణ్నే ననుకున్నాడు... "వెధవహృదయం" అనుకున్నాడు శాస్త్రి. "హృదయంలోని విషయాలు హృదయంలోనే ఉంటే ఇంత రభసయ్యేది కాదు కదా? అవి శరీరంద్వారా బైటపడకుంటే ప్రమాదం ఉండేది కాదుకదా? ఐనా హృదయపూర్వక సౌందర్యాన్ని మెచ్చుకునే తన ఆదర్శం, మల్లిక శరీరం మీదికి దూకాలనుకోవటంలో అర్థముందా?"

మరి కొంతసేపు మల్లికను తిట్టుకున్నాడు. డబ్బుకు శరీరాన్ని అమ్ముకునే ఆమెను పవిత్రహృదయమున్న తను ప్రేమించటమేమిటి? హృదయం ఎంత సుందరమైనా, ఆ మలినమైన దేహంలోనే అది వుంది. కనుక దాన్ని తాను తృణీకరించి ఉండాల్సింది! ఏమైతేనేం– ఆమె తనను పరాభవించింది. ఇతర్లకు అది తెలియదు కనుక – మల్లిక చెప్పదనే నమ్మకం తనకు వుంది కనుక – అంతవరకూ దాన్ని తను భరించగలడు! ఐనా తను వెధవవేషం వెయ్యటంవల్లనే యీ పరాభవం జరిగింది కనుక, దానికది చెల్లు – పోతే, పరాభవించబడితే మాత్రమేం – తన ఆదర్శంమాత్రం చెడలేదు! శరీరం మాత్రం వికారంగా వుంది.

"నమస్కారం – గురువుగారూ!"

మళ్ళీ మల్లిక వొచ్చిందేమోనని తుళ్లిపడ్డాడు. ఒకవేళ తనకు జరిగిన అన్యాయానికి ప్రతిఫలం ముట్టచెప్పే సదుద్దేశంతోనే తిరిగి వొచ్చిందేమోనని మొహమెత్తి చూశాడు...చూస్తే రాధ!

"అట్లా వున్నారేం!" అందామె, విలాసంగా తనకు ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

తను ఎల్లావుంటే వీళ్లకేం? తన చావు తను ఛస్తూంటే వీళ్ళందరూ తనెలా వున్నదీ చూస్తూ ఆనందిస్తున్నట్లుంది.

"ఏం లేదు-"

యీామెకూడా బహుశా ప్రోగ్రాం అయాక వానలో వెళ్ళలేక ఉండిపోయిందేమో? కొంపదీసి ఇందాక మల్లిక రావటం, లోనజరిగిన రంగం యీామె కళ్ళబడలేదు కదా?

"ఏం ఇప్పటిదాకా వున్నావ్?" అన్నాడు ఆమె ఆంతర్యాన్ని కనిపెట్టేందుకు.

"వానకదూ?.... మీతో ఒక విషయం చెపుదామని చాలా కాలంనుంచీ అవకాశంకోసం వేచి కూర్చున్నాను-" అందామె కళ్ళు తమాషాగా తిప్పుతూ.

ఆమె చెప్పబొయ్యే విషయమేమిటో తనకు తెలుసు. అదే ఆమె నోటి వెంట వినవలసివొస్తే కంపరం పుట్టకమానదు. "చెప్పొద్దు" అందామనుకున్నాడు.

ఆమె శాస్త్రి అంగీకారం కోసం వేచి కూర్చునే స్థితిలో లేదు. మెల్లిగా అతని చేతిని, తన చేతుల్లోకి తీసుకుంటూ "మిమ్ము హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను" అంది.

శాస్త్రి నోట మాటరాలేదు. చేతికి ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లు మెల్లిగా లాక్కున్నాడు. నలుగుర్లోనూ "అన్నగారూ!" అని పిలిచే యీామె యీానాడు "గురువుగారూ!" అని మొదలుపెట్టి, చివరకు చెప్పేది ఇదా...

"మీ రచనల్లోని అభ్యుదయం, ఆదర్శం, హృదయ సౌందర్యం... వీటిని నేను బాగా అర్థం చేసుకున్నాను కనుకనే..."

ఆపైన ఆమె వాగేది వినిపించలేదు. తన నాటకాల్లోని సంభాషణల్నే యీామెద్వారా వింటూంటే, అందులోనూ నిజంగానే తనను నాయకుణ్ణిగా చేసి ఆమె మాట్లాడుతూంటే, గొంగళి పురుగులు పాకుతూన్నట్లనిపించింది. ఏదో ప్రజానీకంలో నైతిక దృక్పథం, ఆదర్శ జీవితం మొదలైనవి ప్రవేశ పెట్టేందుకు తానీ అభ్యుదయ దృక్పథాన్ని వేళ్లాడుతూంటే యీామె వాటన్నిటినీ స్వప్రయోజనం కోసం తనకు అంటకట్టాలని చూడటంకన్న దారుణం ఇంకేమన్నా వుందా?

"నీకేం మతిపోతోందా?" అన్నాడు.

"మీ హృదయ సౌందర్యాన్ని గ్రహించటమంటే నాకు మతి పోవటమన్న మాట!"

యీా హృదయ సౌందర్యంమాట దేవునికెరుక - ముందు యీా బ్రహ్మరాక్షసిని వొదిలించుకోవడం ఎలా?

"మీ రచనల్లోని ఆదర్శం నిజంగా అర్థమైనది నాకే ... అందుకనే యీానాడు... హృదయపూర్వకంగా ప్రేమించడమంటే ఏమిటో తెలుసుకొని నిత్యజీవితంలో అమలు జరపగలిగాను. దీనికి తార్కాణం నేను మిమ్ము ప్రేమించ గలగటమే."

శాస్త్రికి వొళ్లు మండిపోతోంది. యీామె నిజంగానే హృదయపూర్వకంగా ప్రేమించి ఉండొచ్చు. తన ఆత్మ సౌందర్యాన్ని ఆరాధించే ఉండొచ్చు. ఐతే తనమీదికి సిగ్గులేకుండా ఇలా ఎగబడటం – తనలాటి పవిత్రుణ్ణి ఏమనుకుందో! ముగ్గురు బిడ్డలతండ్రి తనకూ, పద్దెనిమిదేళ్ళ గుడ్లగూబ యీామెకూ ఏమన్నా యీాడుజోడా? ఐనా యీామెను చూడటమే భయంకరంగా వుంటే, వాదన భయానకమే కాగలదు.

“యీా తుచ్ఛ శరీరం సంగతి కాదు ... మీ ఆత్మ సౌందర్యానికి నేను మూర్ఛపొయ్యానంటే....”

ఆ మూర్ఛ ఇప్పుడే తనకు వొచ్చేట్లుగా వుంది. యీా మాటల్నే మల్లిక అనివుంటే వాటి అర్థం వేరుగా ఉండేది. ఐతే భావాలకు ఒకో చోటు ఒకో అర్థం వుంటుందా? న్యాయం వన్ వే ట్రాఫిక్ లాటిదా? ఐనా ఇప్పుడు తనకీ తర్కాలతో పనేమిటి?

ఆపైన వినదలుచుకోలేదు. ఇప్పుడు యీామెతో వాగ్వాదం వేసుకొనే ఓపికాలేదు. ఎవరైనాచూస్తే ఉద్యోగానిక్కూడా నీళ్ళధారే! అందుకని బైటి నీళ్ళధారనుకూడా లెక్క చెయ్యకుండా తను రాసిన డైలాగుల్ని ఆమెకే వొదిలి ఒక్క ఉరుకులో బైటపడ్డాడు.

వానలో తడుస్తూ చకచకా నడుస్తూనే శాస్త్రి ఆలోచిస్తున్నాడు. ఒకపక్క మల్లికలాటి సుందరి తనను నిరాకరించి, తన ఆదర్శాన్ని కాపాడింది; మరోపక్క రాధలాటి కురూపిని నిరాకరించి తన ఆదర్శాలను కాపాడుకోగలిగాడు... మొత్తం మీద యీా ప్రపంచంలో తన ఆదర్శం కొనసాగే అవకాశాలంటూ ఉన్నవని అర్థమైంది. జీవితాన్ని నడిపే ఆదర్శాన్ని తలుచుకుంటూ, ఆత్మతృప్తితో వానను కూడా లెక్కచేయకుండా శాస్త్రి అభ్యుదయపథంలో చకచకా నడవసాగాడు.

*రచన :– నవంబర్ 1954*